రోడ్డు దాటాలంటే హడల్

- ప్రమాదకరంగా పద్మానగర్ జంక్షన్
- అండర్ పాస్ నిర్మాణం లేక ప్రమాదాలు
- జంక్షన్ వద్ద కనిపించని విద్యుత్‌దీపాలు
- పూర్తికాని సర్వీస్‌రోడ్లు


నకిరేకల్ పట్టణ పరిధిలోని పద్మానగర్ జంక్షన్


చీమలగడ్డ నుంచి ఇనుపాముల వరకు పూర్తికాని సర్వీస్‌రోడ్డు

నకిరేకల్ : పట్టణ పరిధిలోని హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారిపై ఉన్న పద్మానగర్ జంక్షన్ ప్రమాదరకంగా మారింది. ప్రతినిత్యం వాహనాలతో రద్దీగా ఉండే ఈ రహదారిలో ప్రజలు, వాహనదారులు ఇక్కడ రోడ్డు దాటాలంటే హడలెత్తిపోతున్నారు. మరో వైపు ప్రధాన కూడళిలో విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయకపోవడంతో రాత్రి వేళలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. 15ఏళ్ల క్రితమే రెండు వరుసలుగా విస్తరించిన హైదరాబాద్–విజయవాడ రహదారిలో ఇంకా సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నారు. నకిరేకల్ పట్టణం నుంచి జాతీయ రహదారిపైకి రావడానికి, రహదారి నుంచి నకిరేకల్ పట్టణంలోకి వెళ్లడానికి ఈ ప్రధాన జంక్షన్ వద్ద అండర్ పాస్ వంతెన లేకపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. నకిరేకల్ నియోజకవర్గంలోని నకిరేకల్, కేతేపల్లి, కట్టంగూరు, నార్కట్‌పల్లి, చిట్యాల మండలాల మీదుగా 65కీమీ హైవే విస్తరించింది. ఏళ్లు గడుస్తున్నా జీఎంఆర్, హైవే అధికారులు సర్వీస్ రహదారులను పట్టించుకోకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కలగానే అండర్ పాస్ నిర్మాణం..

ప్రధానంగా నకిరేకల్‌లోని పద్మానగర్ జంక్షన్ వద్ద అండర్‌పాస్ నిర్మాణం కళగానే మిగులుతోంది. రహదారి నిర్మాణంలో సమయంలో ఇక్కడ అండర్ పాస్ నిర్మించాల్సి ఉన్నా అధికారులు పట్టించుకోలేదు. దీంతో ఈ జంక్షన్ ప్రమాదకరంగా మారింది. చీమలగడ్డ ఫ్లైఓవర్ అండర్ పాస్ నుంచి ఇనుపాముల జంక్షన్ వరకు కూడా సర్వీస్‌రోడ్డు పూర్తి కాలేదు. నకిరేకల్ పట్టణం నుంచి హైదరాబాద్, నల్లగొండ వైపుకు వెళ్లాలంటే జంక్షన్ దాటి వెళ్లాలి. జంక్షన్ దాటే క్రమంలో హైదరాబాద్ నుంచి విజయవాడ వైపుకు వెళ్లే వాహనాలు అతివేగంగా వెళ్తుండడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇక్కడ విద్యుత్ లైట్లు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. నకిరేకల్‌లోని పద్మానగర్ వద్ద మూడేళ్లలో ఏడుగురు ప్రాణాలు కోల్పోగా 40మందికి పైగా గాయాలపాలయ్యారు. ఈ జంక్షన్ పక్కనే పద్మానగర్‌కాలనీ ఉండడంతో ఆ కాలనీవాసులు రాత్రి వేళలో నకిరేకల్ పట్టణానికి వెళ్లాలంటే భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా హైవే అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పద్మానగర్ జంక్షన్ వద్ద అండర్ పాస్ నిర్మాణం చేపట్టాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

అండర్‌పాస్ నిర్మించాలి



పద్మానగర్ జంక్షన్ వద్ద అండర్ పాస్ నిర్మించాలి. హైవే రోడ్డు దాటాలంటే భయంగా ఉంది. ఈ జంక్షన్ వద్ద లైట్లు లేకపోవడంతో రాత్రి వేళల్లో అంధకారంగా ఉంటుంది. రోడ్డు దాటే క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు తక్షణమే స్పందించి అండర్ పాస్ నిర్మించాలి.

– చిట్టిప్రోలు యాదగిరి, పద్మానగర్, నకిరేకల్

క్లుప్తంగా

బీజేపీ డాక్టర్స్ సెల్ కన్వీనర్‌గా రాజశేఖర్‌రెడ్డి



రాజశేఖర్‌రెడ్డికి నియామకపత్రం అందజేస్తున్న డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్ : పట్టణానికి చెందిన డాక్టర్ వైవీ రాజశేఖర్‌రెడ్డిని బీజేపీ డాక్టర్స్ సెల్ జిల్లా కన్వీనర్‌గా నియమిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఆయన రాజశేఖర్‌రెడ్డికి నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పోతెపాక సాంబయ్య, కంచర్ల విద్యాసాగర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీఐ జిల్లా సెక్రటరీగా వేణుగోపాల్‌రెడ్డి



చిట్యాల : మండలంలోని నేరడ గ్రామానికి చెందిన మంద వేణుగోపాల్‌రెడ్డిని ఆర్టీఐ రక్షక్ జిల్లా సెక్రటరీగా నియమిస్తూ ఆ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు ఆమనగంటి సతీష్ శుక్రవారం ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. సమాచార హక్కు చట్టంపై ప్రజలందరికీ అవగాహన కల్పించి సామాజిక బాధ్యత పెంచేందుకు తనవంతు కృషిచేస్తానని అన్నారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు సతీష్, జిల్లా అధ్యక్షుడు కునూరు మధుకు కృతజ్ఞతలు తెలిపారు.

సీపీఎం మండల కార్యదర్శిగా మల్లేష్

మునుగోడు : మండలంలోని కల్వలపల్లి గ్రామానికి చెందిన సాగర్ల మల్లేష్ సీపీఎం మండల కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం కల్వలపల్లి గ్రామంలో నిర్వహించిన పార్టీ 8వ మండల మహాసభలో పార్టీ జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బండా శ్రీశైలం సమక్షంలో ఆయనను ఎన్నుకున్నారు.

గురుకులంలోకి నెమలి


ఫారెస్ట్ అధికారులకు నెమలిని అప్పగిస్తున్న పాఠశాల ప్రిన్సిపాల్ శోభారాణి

నకిరేకల్ : పట్టణంలోని మార్కెట్‌రోడ్డులో గల సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాల ఆవరణలోకి శుక్రవారం నెమలి వచ్చింది. దీంతో పాఠశాల ప్రిన్సిపాల్ శోభారాణి నెమలిని పట్టుకుని ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించి వారికి అప్పగించారు.

ఇందిరమ్మ కమిటీలతో పేదలకు న్యాయం జరగదు

నార్కట్‌పల్లి : ఇందిరమ్మ కమిటీలతో పేద ప్రజలకు న్యాయం జరగదని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ కమిటీల పేర్లు కాంగ్రెస్ నాయకుల కనుసన్నల్లోనే ఎంపిక జరుగుతుందన్నారు. అవి ఇందిరమ్మ కమిటీలు కావని కాంగ్రెస్ నాయకుల కమిటీ అని ఆరోపించారు. ఇళ్ల ఎంపిక ప్రక్రియ నిష్పక్షపాతంగా జరగాలంటే మండల స్థాయి అధికారిని ప్రత్యేక అధికారిగా నియమించాలని, గ్రామస్థాయిలో త్రిసభ్య అధికార కమిటీని ఏర్పాటు చేస్తేనే నిజమైన పేదలకు లబ్ధి జరుగుతుందని అన్నారు.

వీధిలైట్లు మంజూరు

మునుగోడు : మండలంలోని సింగారం గ్రామానికి ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తన నిధుల నుంచి 28హైమాస్ వీధి లైట్లను మంజూరు చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం గ్రామ కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం గ్రామంలో అవసరమైన చోట వాటిని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు పోగుల జానకీప్రకాష్, జిల్లా లక్ష్మమ్మవెంకటేష్, ఉప్పునూతల రమేష్, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు కుంభం చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

20న సీపీఎం పట్టణ మహాసభ

నల్లగొండ టౌన్ : పట్టణంలోని దొడ్డి కొమరయ్య భవన్‌లో ఈనెల 20న సీపీఎం పట్టణ మహాసభ నిర్వహించనున్నట్లు ఆ పార్టీ పట్టణ కార్యదర్శి ఎండీ సలీం తెలిపారు. శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాసభకు పార్టీ జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సయ్యద్‌హాషం హాజరుకానున్నట్లు తెలిపారు. ఆయన వెంట పార్టీ జిల్లా కమిటీ సభ్యులు దండెంపల్లి సత్తయ్య, తుమ్మల పద్మ తదితరులు ఉన్నారు.

అక్రమ కేసులు పెడితే సహించేది లేదు

- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య


మాట్లాడుతున్న మాజీ చిరుమర్తి లింగయ్య

నల్లగొండ టూటౌన్ : బీఆర్ఎస్ కార్యకర్తలపై కాంగ్రెస్ నాయకులు దాడులు చేస్తున్నారని, పోలీసులకు ఫిర్యాదు చేసినా తిరిగి బీఆర్ఎస్ కార్యకర్తల పైనే అక్రమ కేసులు బనాయిస్తున్నారని, మా పార్టీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెడితే సహించేదిలేదని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. శుక్రవారం నల్లగొండ పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జెడ్పీ మాజీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. నకిరేకల్ సీఐ రాజశేఖర్ తీరుమార్చుకోకపోతే తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చర్యలు తప్పవని హెచ్చరించారు. కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడులు, దౌర్జన్యాలు చేయడం పరిపాటిగా మారిందన్నారు. కేతేపల్లి మండలంలోని చెరుకుపల్లి గ్రామంలో పోకల సైదులు అనే కార్యకర్తపై కాంగ్రెస్ నాయకులు దాడి చేస్తే స్థానిక పోలీస్‌స్టేషనలో ఫిర్యాదు చేసినా అతడిపైనే కేసు పెట్టారని అన్నారు. దసరా రోజు కేతేపల్లిలో 14మంది కాంగ్రెస్ కార్యకర్తలు తమ పార్టీకి చెందిన వారిపై కర్రలు, రాడ్లతో తలలు పగిలేలా కొట్టినా వారిపై కేసులు లేవన్నారు. నకిరేకల్ పట్టణంలో బీఆర్ఎస్ కార్యకర్తలను పోలీస్‌స్టేషన్ గేటు లోపలికి కూడా రానీయడంలేదన్నారు. కట్టంగూరు మండలంలోని చెర్వుఅన్నారం గ్రామంలో మాజీ ఎంపీటీసీని ఇంట్లో చొరబడి కారంచల్లి కొట్టి గాయపరిచినట్లు తెలిపారు. ఫిర్యాదు చేసేందుకు స్టేషన్‌కు వెళ్లితే అక్కడి ఎస్ఐ బెదిరిస్తున్నారని ఆరోపించారు. పోలీసులు అధికార పార్టీ నాయకులకు తొత్తులుగా మారి బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడులకు దిగితే సహించబోమన్నారు. సమావేశంలో నకిరేకల్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణపై నిర్లక్ష్యం వహించొద్దు

శాలిగౌరారం : గ్రామాలలో పారిశుద్ధ్య నిర్వహణ పట్ల సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి అన్నారు. మండలంలోని ఊట్కూరు గ్రామపంచాయతీ కార్యాలయంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సభలో ఆమె పాల్గొని మాట్లాడారు. వర్షాలతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నందున ప్రజలు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా పైపులైన్ లీకేజీలు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా తాగునీటి ట్యాంకులను ప్రతీ వారం శుభ్రపరిచి క్లోరినేషన్ చేయాలన్నారు. గ్రామసభలో కార్యదర్శి, ఆయా శాఖల సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం


సమావేశంలో మాట్లాడుతున్న మధుబాబు

నల్లగొండ : ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా చైర్మన్ లకుమాల మధుబాబు అన్నారు. శుక్రవారం పట్టణంలోని మాల మహానాడు కార్యాలయంలో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం డీఎస్సీ ద్వారా ఇటీవల చేపట్టిన ఉపాధ్యాయ నియామకాలలో ఈడబ్ల్యుఎస్ కోటా కింద ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు అన్యాయం జరిగిందని, ఈ విషయంపై ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘాల నాయకులు ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశంలో మనువాదాన్ని అమలు చేయాలని కుట్రపన్నుతోందని ఆరోపించారు. తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ చేయాలని ప్రభుత్వం ఆలోచన చేయడం తగదన్నారు. ఎస్సీ వర్గీకరణ ఆలోచనను వెనక్కితీసుకునే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

నకిలీ మందులు విక్రయిస్తే చర్యలు తప్పవు


మునుగోడులో తనిఖీ చేస్తున్న ఏడీఏ వేణుగోపాల్


కనగల్ : తనిఖీ చేస్తున్న ఏఓ అమరేందర్‌గౌడ్

మునుగోడు : ఎరువుల దుకాణాల యజమానులు రైతులకు నకిలీ పురుగు మందులు, ఎరువులు విక్రయిస్తే చట్టపరమై చర్యలు తప్పవని, అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని ఏడీఏ వేణుగోపాల్ హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలోని పలు ఎరువుల దుకాణాలలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఈపాస్ మిషన్లలో నమోదు చేసిన తర్వాతే రైతులకు ఎరువులను విక్రయించాలన్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పురుగు మందులు, ఎరువులను అమ్మాలని సూచించారు. ఆయన వెంట ఏఈఓ నర్సింహ ఉన్నారు.

ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు

కనగల్ : మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాలను మండల వ్యవసాయ అధికారి బెజవాడ అమరేందర్‌గౌడ్ శుక్రవారం తనిఖీ చేశారు. దుకాణాల్లో పురుగు మందుల బిల్లులు, పీసీలు దానితో పాటు వాటిపై ఉన్న బ్యాచ్ నంబర్లు, స్టాక్ రిజిస్టర్లు, స్టాక్ వివరాలను పరిశీలించారు. నాణ్యత లేని పురుగు మందులను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుని లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు.

చండూరు(గట్టుప్పల్) : లైసెన్స్ ఉన్న ఫర్టిలైజర్ దుకాణాల్లోనే ఎరువులను కొనుగోలు చేయాలని ఏఓ రేవతి రైతులకు సూచించారు. శుక్రవారం గట్టుప్పల్ మండల పరిధిలోని పలు ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. రైతులు కొనుగోలు చేసిన ఎరువులకు సంబంధించిన బిల్లులు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు.

వ్యవసాయ అధికారిగా శివ

నాంపల్లి : మండల వ్యవసాయ అధికారిగా బండారు శివ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన మండలంలోని ఎరువుల దుకాణాలలో తనిఖీలు నిర్వహించారు. రైతులకు నాణ్యమైన ఎరువులను అందించాలన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే వేముల వీరేశం


చిట్యాల : కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం, చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి


కనగల్ : చర్లగౌరారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ పద్మ

చిట్యాల : గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. శుక్రవారం మండలంలోని గుండ్రాంపల్లి గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. రైతులు దళారులకు ధాన్యాన్ని అమ్ముకోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాలలో విక్రయించి మద్దతు ధరతో పాటు రూ.500బోనస్ పొందాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర డెయిరీ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి, డీసీసీబీ వైస్‌చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డి, తహసీల్దార్ క్రిష్ణనాయక్, ఎంపీడీఓ జయలక్ష్మి, నాయకులు, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి : ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. శుక్రవారం మండలంలోని ఎల్లారెడ్డిగూడెం, ఏపీ లింగోటం, నార్కట్‌పల్లి గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు దళారులకు ధాన్యం అమ్మి మోసపోవద్దన్నారు. కేంద్రాల్లో రైతులకు సరిపడా మౌలిక వసతులు కల్పించాలని సంఘబంధం సభ్యులకు ఆయన సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, ఎంపీడీఓ సుధాకర్, ఏపీఎం శ్రీదేవి, నాయకులు పాశం శ్రీనివాసరెడ్డి, దూదిమెట్ల సత్తయ్య, పుల్లెంల అచ్చాలు, దూదిమెట్ల స్రవంతి, సట్టు సత్తయ్య, జేరిపోతుల భరత్, పశుపతి, నల్ల వెంకన్న, మధుసూదన్ రెడ్డి, పీటల శంకర్, రేగట్టె నవీన్‌రెడ్డి, నర్సిరెడ్డి, కృష్ణ, గడుసు శశిధర్‌రెడ్డి, వారాల రమేష్ ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

కనగల్ : ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు ప్రభుత్వం మద్దతు ధర కల్పిస్తుందని తహసీల్దార్ పద్మ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడారు. తేమ శాతాన్ని దృష్టిలో ఉంచుకొని సీరియల్ ప్రకారంగా ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. కేంద్రాల వద్ద రైతులకు మౌలిక వసతులు కల్పించాలన్నారు. కేంద్రాల్లోకి వచ్చిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు లారీల్లో కొనుగోలు చేసి మిల్లర్ల వద్దకు పంపాలన్నారు. కార్యక్రమంలో ఏఓ అమరేందర్‌గౌడ్, ఏపీఎం సంకు హరి, సీనియర్ అసిస్టెంట్ ఎర్రమాద విఘ్నేశ్వర్‌రెడ్డి, ఆర్ఐ యాదగిరి, కాంగ్రెస్ నాయకులు మందడి రామచంద్రారెడ్డి, చిలకరాజు వెంకన్న, కూసుకుంట్ల రాజిరెడ్డి, మెరుగు శివయ్య, ఎమిరెడ్డి దిలీప్‌రెడ్డి, కలకురి నాగరాజు, చింతల బ్రహ్మయ్య, బొగరి రాంబాబు, పోషమళ్ల లింగయ్య, సీఆర్పీ జానకి, సీసీలు ప్రభాకర్, వసంత, నర్సింహ, సంఘబంధం మహిళలు, వీబీకేలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డు ఉద్యోగులకు ఘన సన్మానం


రిటైర్డ్ ఉద్యోగులను సన్మానిస్తున్న సంఘం నాయకులు, తదితరులు

నకిరేకల్ : పట్టణంలోని తెలంగాణ ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో అక్టోబర్ నెలలో జన్మించిన సర్వీస్ పెన్షనర్స్, ఫ్యామిలీ పెన్షనర్స్‌కు శుక్రవారం సాముహిక జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి వారిని శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం రిటైర్డ్ ఉద్యోగులు కొయ్యడ సత్యనారాయణ, మల్ల య్య, వడ్డకొండ సైదులు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షుడు వంటల రామలింగం, సంఘం ప్రధాన కార్యదర్శి సోమయ్య, సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బాదిని లింగయ్య, నాయకులు కందాల పాపిరెడ్డి, భిక్షంరెడ్డి, వీరమల్ల రవీందర్, లచ్చయ్య, జంగయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి ఘన సన్మానం


ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డిని సన్మానించిన యువజన కాంగ్రెస్ నాయకులు

మునుగోడు : నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు వెళ్లే లింకు మట్టిరోడ్ల అభివృద్ధికి ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి రూ.15కోట్ల నిధులు మంజూరు చేయించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ యువజన కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ఢిల్లీలో ఆయనను ఘనంగా సన్మానించారు. సన్మానించిన వారిలో నాయకులు మేకల ప్రమోద్‌రెడ్డి, అబ్బరబోయిన అనిల్, ఏనుగు రఘుమారెడ్డి, జాల మణియాదవ్ తదితరులు ఉన్నారు.

బీటీరోడ్ల నిర్మాణానికి రూ.15కోట్లు మంజూరు

మునుగోడు : నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు వెళ్లే మట్టి రోడ్లను బీటీరోడ్లుగా మార్చేందుకు పంచాయతీరాజ్ శాఖ నుంచి రూ.15కోట్ల నిధులు మంజూరయ్యాయి. తొమ్మిది గ్రామాలకు 15కిలోమీటర్ల మేర రూ.15 కోట్లు మంజూరు చేశారు. అందులో మునుగోడు మండలంలోని చల్మెడ నుంచి బొత్తలగూడెం, పలివెల రోడ్డు నుంచి ఎలగలగూడెం, కొండాపురం రోడ్డు నుంచి కల్వకుంట్ల, మునుగోడు పట్టణంలోని చండూరు రోడ్డు నుంచి దుబ్బకాల్వ రోడ్డు వరకు, చండూరు రోడ్డు నుంచి లక్ష్మీదేవిగూడెం మీదుగా దుబ్బకాల్వ రోడ్డు, చండూరు రోడ్డు బీసంవారిగూడెం నుంచి సోలిపురం, కిష్టాపురం నుంచి చిట్యాల మండలం చిన్నకాపర్తి ఎక్స్‌రోడ్డు వరకు, మర్రిగూడ మండలంలోని సరంపేట నుంచి శివనేనిగూడెం, చండూరు మండలంలోని తిమ్మారెడ్డిగూడెం నుంచి తుమ్మలపల్లి వరకు బీటీ నిర్మాణం చేసేందుకు నిధులు మంజూరు చేశారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

వానరానికి అంత్యక్రియలు

చిట్యాల : మున్సిపాలిటీలోని 12వవార్డు వనిపాకల రోడ్డులో శుక్రవారం కుక్కల దాడిలో ఓ వానరం మృతి చెందింది. దీంతో స్థానికులు వానరానికి అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ రెముడాల లింగస్వామి, నాయకులు సాగర్ల గోవర్ధన్, పందిరి నారాయణ, క్రిష్ణమూర్తి, నీల వెంకటేశ్వర్లు, కార్మికులు పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖ ఎస్ఈని సన్మానించిన కాంట్రాక్టర్లు


ఎస్ఈని సన్మానించి పుష్పగుచ్ఛం అందజేస్తున్న విద్యుత్ కాంట్రాక్టర్ల సంఘం నాయకులు

నల్లగొండ : విద్యుత్ శాఖ నూతన ఎస్ఈగా బాధ్యతలు చేపట్టిన అయితగోని వెంకటేశ్వర్లును శుక్రవారం పట్టణంలోని ఎస్ఈ కార్యాలయంలో విద్యుత్ కాంట్రాక్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాంట్రాక్టర్లు కలిశారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించారు. సన్మానించిన వారిలో సంఘం ఆర్గనైజింగ్ కార్యదర్శి పర్వతాలు, నాయకులు ఎస్‌కె మోయిజ్, వేణుగోపాల్, యాదగిరి, శ్రీనివాస్‌గౌడ్, సత్తిరెడ్డి, కనకాచారి, తిరుపతిరెడ్డి ఉన్నారు.

ఎస్సీ, ఎస్టీ కాంట్రాక్టర్ల ఆధ్వర్యంలో..

విద్యుత్ శాఖ ఎస్ఈగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వర్లును స్థానిక ఎస్ఈ కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ విద్యుత్ కాంట్రాక్టర్ల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సన్మానించారు. సన్మానించిన వారిలో సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు బాలకృష్ణ, రుద్రాక్షి రవి, సూరారపు పరమేష్, రవిచంద్ర, పాపయ్య, నరేందర్, కృష్ణయ్య ఉన్నారు.

ఘనంగా అనిల్‌రెడ్డి జన్మదిన వేడుకలు


మంత్రి వెంకట్‌రెడ్డి ఆశీర్వాదం తీసుకుంటున్న అనిల్‌రెడ్డి


కేక్ కట్ చేస్తున్న అనిల్‌రెడ్డి చిత్రంలో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మోహన్‌రెడ్డి

నల్లగొండ : కాంగ్రెస్ నాయకుడు వంగాల అనిల్‌రెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం నల్లగొండ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. అనిల్‌రెడ్డి ఉదయం హైదరాబాద్‌లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. సాయంత్రం నల్లగొండలోని శివాజీనగర్ సెంటర్‌లో మున్సిపల్ చెర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి సమక్షంలో అనిల్‌రెడ్డి కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ రమేష్‌గౌడ్, నాయకులు కర్నాకర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, దేవుని వెంకన్న పాల్గొని అనిల్‌రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

మూఢనమ్మకాలను విశ్వసించవద్దు

వేములపల్లి : మూఢనమ్మకాలను విశ్వసించవద్దని డివిజన్ హెల్త్ ఎడ్యుకేటర్ వి. సత్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని శెట్టిపాలెం, ఇటిక్యాల గ్రామాల్లో కొంతకాలంగా జరిగిన మరణాలపై నెల కొన్న మూఢనమ్మకంతో గ్రామస్తులు ఒక రోజంతా ఖాళీ చేసి వెళ్లడంతో ఆయన హెల్త్‌టీంతో కలిసి గ్రామాన్ని శుక్రవారం సందర్శించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సంరద్భంగా ఆయన మాట్లాడుతూ మరణాలు కేవలం యాదృచ్ఛికంగా జరుగుతాయని, వాటికి ఎటువంటి మూఢ నమ్మకాలను ఆపాదించవద్దన్నారు కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య పబ్లిక్ హెల్త్ నర్స్ భాగ్యలక్ష్మీ, సూపర్‌వైజర్ శాంతమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ అరుణ, ఏఎన్ఎం జయమ్మ, ఆశాలు ఝాన్సీ, నాగమ్మ, శైలజ, ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, ఉపాధ్యాయులు తిరుపతి, విద్యార్థులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న సత్యనారాయణరెడ్డి

సమాచార హక్కు చట్టం ఆవిర్భావ దినోత్సవం


జెండా ఎగురవేస్తున్న బొడ్డు బాబురావు

చిట్యాల : పట్టణంలో సమాచార హక్కు ప్రజాచైతన్య సమితి ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టం –2005 ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సమాచార హక్కు చట్టం జెండాను ప్రజా చైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బొడ్డు బాబురావు ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. సమాచార హక్కు చట్టంపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు జిట్టు నగేష్, చేతి వృత్తిదారుల సంఘం జిల్లా కమిటీ సభ్యుడు అవిశెట్టి శంకరయ్య, సమాచార హక్కు ప్రజాచైతన్య సమితి జిల్లా కమిటీ సభ్యుడు గాదె ఎల్లేష్, ఏనుగు నరేందర్‌రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ పోకల అచ్చాలు ఉన్నారు.

రమణయ్య మృతి పార్టీకి తీరనిలోటు

తిప్పర్తి : కేవీపీఎస్ మండల కార్యదర్శి గంటికంపు రమణయ్య మృతి పార్టీకి తీరనిలోటని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని గంగన్నపాలెం గ్రామంలో రమణయ్య మృతదేహాన్ని సందర్శించి ఎర్రజెండా కప్పి నివాళులర్పించారు.


నివాళులర్పిస్తున్న ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి

రోడ్డుపై ఇష్టారీతిగా వాహనాలు నిలిపితే చర్యలు


వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

నల్లగొండ క్రైం : రోడ్డుపై ఇష్టారీతిగా వాహనాలు నిలిపితే కఠిన చర్యలు తప్పవని ట్రాఫిక్ సీఐ రాజు అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రధాన కూడళ్లు, మూలమలుపుల వద్ద నిబంధనకు విరుద్ధంగా నిలిపిన 50వాహనాలను టోయింగ్ వాహనంలో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం వాహనదారులకు రూ.1000 జరిమానా విధించారు.